E-KABURU E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

(తేదీ) 03-05-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



యూపీ గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారత వైమానిక దళ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ డ్రిల్ » 3లో

# సీడబ్ల్యూసీ భేటీ... తెలంగాణ దేశానికే రోల్ మోడల్.. సీఎం రేవంత్



- సీఎం రేవంత్ రెడ్డి ఢీల్లీ టూర్
- కీలక అంశాలపై చర్చలు జరిగే అవకాశం
- కులగణన కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ హర్షం
- సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొననున్న తెలంగాణ సీఎం
- పహల్గామ్ దాడి అనంతర పరిణామాలపై ప్రభుత్వ వ్యూహంపై విమర్శ

**మృతి చెందిన వారికి అమరవీరుల హోదా కల్పించాలని రాహుల్ గాంధీ డిమాండ్**

**ఉగ్రవాదంపై పోరాటానికి కేంద్రానికి విపక్షాల సంపూర్ణ మద్దతు ఉంటుందని పునరుద్ఘాటన**

ఈ కబురు: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (శుక్రవారం) సాయంత్రం ఢిల్లీలో జరిగే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి హాజరవుతారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఢిల్లీలో జరిగే మొట్టమొదటి సీడబ్ల్యూసీ సమావేశం కాబట్టి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలు ప్రస్తావించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా జన గణనతో పాటు కుల గణన కూడా చేయాలని కేంద్ర మంత్రివర్గ నిర్ణయం, పహల్గామ్ ఘటనపై ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఢిల్లీలో జరిగే ఈ సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరుకావడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో ఆయన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలను కూడా ప్రస్తావించే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,

తరువాయి 2లో

# అమరావతి'కి సహకరిస్తాం.. ఏపీ కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలు: మోదీ




- అమరావతి నగరం కాదు, శక్తి – వికసిత్ భారత్‌కు ఏపీ కీలకం
- అభివృద్ధిలో చంద్రబాబు కీలక నాయకుడు – మోదీ ప్రశంసలు
- పవన్ కల్యాణ్‌కు పిలుపు – కలల ఏపీ కోసం కలసి పని చేద్దాం
- కనెక్టివిటీ – రూ.60,000 కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపన

**విశాఖ యోగా డే, నాగాయలంక రక్షణ శక్తి – దేశ అభివృద్ధిలో ఏపీ దోహదం**

ఈకబురు, అమరావతి: అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని చెప్పారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలుపెట్టిన ఆయన.. ''దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది'' అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు.

» 2లో

## ఇందిరమ్మ ఇళ్లు 600 చ.అడుగులు మించొద్దు: మంత్రి పొంగులేటి



**ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు.**

ఈకబురు, : ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా ఇన్‌ఛార్జి మంత్రులు ఆమోదం పొందాలన్నారు. ఇళ్లు విస్తీర్ణం 600 చదరపు అడుగులు మించకూడదన్నారు. ప్రతి నియోజకవర్గంలో పట్టణప్రాంతంలో 500 ఇళ్లు నిర్మించాలని చెప్పారు. ఈ నెల 5 నుంచి 20 వరకు 28 మండలాల్లో భూభారతి సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

» 2లో

## సోనియా, రాహుల్ గాంధీలకు ఢిల్లీకోర్టు నోటీసులు



**నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది.**

ఈకబురు, ఢిల్లీ: నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ లకు ఢిల్లీ కోర్టు నోటీసులు జారీ చేసింది. ఛార్జిషీట్‌పై న్యాయబద్ధమైన విచారణ జరిగే సమయంలో ఎప్పుడైనా అవతలి పక్షంవారు తమ వాదనలు వినిపించే హక్కు ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. దీనిపై తదుపరి విచారణను మే 8కి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకోలేమని..

» 2లో

# మాకు నిజాయతీనే ముఖ్యం.. ట్రంప్ చర్చల ప్రతిపాదనపై డ్రాగన్



**సుంకాల తగ్గింపుపై అమెరికాతో చర్చలు జరపాలా..? వద్దా..? అనే విషయంపై చర్చించి అంచనాకు వస్తామని చైనా తెలిపింది.**

ఈ కబురు,బీజింగ్: అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం నెలకొన్న విషయం తెలిసిందే. టారిఫ్‌లపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. తాజాగా ఈ విషయంపై బీజింగ్ స్పందిస్తూ.. వాషింగ్టన్ ఇటీవల తీసుకున్న వాణిజ్య విధాన నిర్ణయాలు, సుంకాల తగ్గింపు విషయంపై అగ్రరాజ్యంతో చర్చలు జరపాలా..? వద్దా.. అని యోచిస్తున్నట్లు వెల్లడించింది. ''టారిఫ్ సమస్యలపై బీజింగ్‌తో చర్చలు జరపాలనే ఆశను వ్యక్తంచేస్తూ అమెరికా సంబంధిత వర్గాల ద్వారా అనేకసార్లు సందేశాలను పంపింది. దీంతో చర్చల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే విషయాన్ని అధికారులతో సంప్రదించి ఓ అంచనాకు వస్తాము'' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

» 2లో

## త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందం: జేడీ వాన్స్



» 3లో

## హీటెక్కిన కులగణన రాజకీయం.. గవర్నర్‌ను కలిసిన టీ కాంగ్రెస్ బీసీ నేతలు



# కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది: మాజీ మంత్రి హరీశ్‌రావు



**తెలంగాణను భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, మరోవైపు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు.**

ఈ కబురు,జహీరాబాద్: భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణకు భాజపా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. భారాస మొదలుపెట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా మొత్తం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు.

» 2లో

# నా పక్కన శశి థరూర్.. వాళ్లకు నిద్రపట్టదేమో': మోదీ వ్యంగ్యాస్త్రాలు

**కాంగ్రెస్ నేతలను ఉద్దేశించి ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. తనతో పాటు శశిథరూర్ ఉండటంతో కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.**

ఈకబురు, తిరువనంతపురం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం కేరళలో పర్యటించారు. తిరువనంతపురం సమీపంలో రూ.8,900 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన విఝింజమ్ ఇంటర్నేషనల్ డీప్‌వాటర్ మల్టీపర్పస్ సీపోర్టును ప్రధాని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తిరువనంతపురం ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ హాజరయ్యారు. దీనిపై ప్రధాని మోదీ స్పందిస్తూ.. ప్రతిపక్ష పార్టీపై వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఈ ఫొటో చూసి కొందరికి నిద్ర పట్టదని ఎద్దేవా చేశారు.

''ఈ రోజు శశిథరూర్ ఇక్కడ ఉన్నారు. ఈ ప్రోగ్రామ్ కొందమందికి నిద్ర లేని రాత్రిని మిగులుస్తుంది. ఈ సందేశం ఎక్కడికి వెళ్లాలో అక్కడికి వెళ్లిపోయింది'' అని మోదీ పరోక్షంగా కాంగ్రెస్‌ను చమత్కరించారు. కాగా.. గురువారం రాత్రి కేరళ చేరుకున్న ప్రధానిని థరూర్ వ్యక్తిగతంగా వెళ్లి స్వాగతించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన సంగతి తెలిసిందే



» 2లో

కీలక మ్యాచ్‌లో హైదరాబాద్ బోల్తా.. ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం » 6లో




## అందుకే అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించా: విరాట్ కోహ్లీ

» 6లో



కింగ్డమ్' స్టోరీని రివీల్ చేసిన మొదటి పాట » 5లో



ఈ పోస్టల్ స్కీమ్‌స్‌కు ఆధార్‌తో ఈకేవైసీ.. పేపర్ వర్క్ అవసరం లేదిక! » 4లో



## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే మా లక్ష్యం: డిప్యూటీ భట్టి



» 3లో

మొదటి పేజీ తరువాయి

# అమరావతి'కి సహకరిస్తాం.. ఏపీ కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలు: మోదీ




**చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు..**

''టెక్నాలజీ నాతో మొదలైనట్లు చంద్రబాబు నన్ను ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు అందిస్తుంది'' అన్నారు.

**పవన్ జీ.. ఇది మనమే చేయాలి..**

''ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నా'' అన్నారు.

''ఇంద్రలోకం రాజధాని అమరావతి. ఇప్పుడు ఏపీ రాజధాని పేరు కూడా అమరావతే. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. ఏపీని ఆధునిక ప్రదేశ్, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఈ నగరం ఎదుగుతుంది. ఐటీ, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్యస్థానంగా మారుతుంది. హరితశక్తి, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి మారుతుంది. అమరావతిలో మౌలికవసతుల కల్పనకు కేంద్ర సహకరిస్తుంది'' అని చెప్పారు.

**కనెక్టివిటీకి కొత్త అధ్యాయం..**

''ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుంది. రైల్వే ప్రాజెక్టులతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి అనుసంధానం పెరుగుతుంది. ఈ అనుసంధానం తీర్థయాత్రలకు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రైల్వే బడ్జెట్ రూ.900 కోట్ల లోపే ఉండేది. ఇప్పుడు కేవలం ఏపీకే రూ.9వేల కోట్ల రైల్వే నిధులు ఇచ్చాం. ఏపీకి గతం కంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించాం. గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జ్‌లు, అండర్‌పాస్‌లు నిర్మించాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు కేటాయించాం. ఏపీలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైతు వికాసానికి కేంద్రం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. రైతులకు పథకాలు, పరిహారం కింద రూ.17వేల కోట్లు సాయం చేశాం. పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తాం. ప్రతి ఎకరానికీ నీరు ఇచ్చేందుకు కృషిచేస్తాం''

''వికసిత్ భారత్ నిర్మాణం కావాలంటే మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలి. ఈ నాలుగు వర్గాలు నాలుగు స్తంభాలు లాంటివారు. రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. నాగాయలంకలో టెస్టింగ్ రేంజ్.. దుర్గామాత లాగా భారత రక్షణ రంగానికి శక్తినిస్తుంది. శ్రీహరికోట నుంచి ప్రయోగించే ప్రతి రాకెట్ కోట్లాది భారతీయులకు గర్వకారణం. భారత శక్తి అంటే కేవలం మన ఆయుధాలే కాదు.. మన ఐక్యత కూడా. విశాఖలో యునిటీమాల్ అభివృద్ధి చేస్తున్నాం''

**విశాఖలో యోగా డేకు హాజరవుతా**

''విశాఖలో జూన్ 21న జరగనున్న యోగా డేలో పాల్గొంటాను. నన్ను ఆహ్వానించినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్. మన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. వచ్చే 50 రోజులూ ఏపీలో యోగాకు అనుకూల వాతావరణం కల్పించాలి. ఏపీలో కలలు కనేవాళ్ల సంఖ్య తక్కువేం కాదు.. ఆ కలల్ని నిజం చేసేవారి సంఖ్యా తక్కువకాదు. ఏపీ సరైన మార్గంలో నడుస్తోంది. సరైన వేగంతో ముందుకెళ్తోంది. దీన్ని కొనసాగించాలి. మూడేళ్లలో అమరావతి పనుల్ని పూర్తి చేస్తామని సీఎం అన్నారు. ఆ పనులు పూర్తయ్యాక ఏపీ జీడీపీ ఏ స్థాయికి వెళ్తుందో నేను ఊహించగలను. అది ఏపీ రాష్ట్రం చరిత్ర గతిని మార్చబోతోంది. ఏపీ అభివృద్ధిలో మీ భుజంతో కలిపి నా భుజం కలిపి పనిచేస్తాను. అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు'' అని ప్రధాని తెలిపారు.

మొదటి పేజీ తరువాయి

## కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది: మాజీ మంత్రి హరీశ్‌రావు



''సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులు పూర్తి చేయడానికి భారాస పోరాటం చేస్తుంది. తాగు, సాగునీరు కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారాస హయాంలో వచ్చిన నీళ్లు ఇప్పుడు ఎందుకు రావడం లేదు? పాలనా వైఫల్యం, కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. వాళ్ల మోసం ప్రజలకు తెలిసిపోయింది. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. తెలంగాణ అభివృద్ధి మాతోనే సాధ్యమవుతుంది'' హరీశ్ రావు తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్లు 600 చ.అడుగులు మించొద్దు: మంత్రి పొంగులేటి



ఈ మేరకు మంత్రి సచివాలయం నుంచి సీఎస్ రామకృష్ణారావుతో కలిసి భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులని తేలితే ఇళ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా సరే రద్దు చేస్తామని, జాబితా 1, జాబితా 2, జాబితా 3లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలని మంత్రి అధికారులకు స్పష్టం చేశారు. ఈ నెల 4న జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 72,572 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నట్లు మంత్రి చెప్పారు. ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరుతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్‌లను అందుబాటులో

## సోనియా, రాహుల్ గాంధీలకు దిల్లీకోర్టు నోటీసులు

కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ ఇటీవల దిల్లీ కోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. గతవారం ఈ కేసును విచారించిన న్యాయస్థానం ఈడీ సమర్పించిన ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేని కారణంగా రాహుల్, సోనియా గాంధీలకు నోటీసులు ఇచ్చేందుకు నిరాకరించింది. తాజాగా దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ చర్యలు తీసుకుంది.

'నా పక్కన శశి థరూర్.. వాళ్లకు నిద్రపట్టదేమో': మోదీ వ్యంగ్యాస్త్రాలు

'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ  అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. విదేశీ నిధులతో నేషనల్ హెరాల్డ్ పత్రికను పెంచి పోషించారన్న ఫిర్యాదుల మేరకు ఈడీ, సీబీఐ దర్యాప్తు చేశాయి. సీబీఐ విచారణ మధ్యలోనే నిలిచినప్పటికీ.. ఈడీ దర్యాప్తు మాత్రం కొనసాగుతోంది. ఇటీవల ఈ కేసులో 2023, నవంబరులో జప్తు చేసిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.661 కోట్ల విలువైన ఆస్తుల స్వాధీనానికి చర్యలు ప్రారంభించింది. ఆస్తులున్న ప్రాంతాల్లో (దిల్లీ, ముంబయి, లఖ్‌నవూ) భవనాలకు నోటీసులు అంటించినట్లు వెల్లడించింది. కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో దిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లెయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

# సీడబ్ల్యూసీ భేటీ... తెలంగాణ దేశానికే రోల్ మోడల్.. సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి




రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఢిల్లీలో జరిగే ఈ సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరుకావడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో ఆయన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలను కూడా ప్రస్తావించే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ఆయన జాతీయ నాయకులకు వివరించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు.ఉదయం 9.30 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుండి బయల్దేరనున్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. కుల గణనకు సంబంధించిన విషయాలను సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం రేవంత్ వివరించనున్నారు. ఇవాళ సాయంత్రం ఢిల్లీలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ముఖ్య నాయకులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్య కాంగ్రెస్ నేతలు హాజరుకానున్నారు. కులగణనపై కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ వ్యూహాలు, విధి విధానాలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ఢిల్లీలో జరిగే ఈ సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరుకావడం ఇదే మొదటిసారి. ఈ సమావేశంలో ఆయన తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన అంశాలను కూడా ప్రస్తావించే అవకాశం ఉంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల గురించి ఆయన జాతీయ నాయకులకు వివరించే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా దేశ రాజకీయాల్లో కుల గణన అంశం ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. ఈ నేపథ్యంలో, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం చాలా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో తీసుకునే నిర్ణయాలు రాబోయే రోజుల్లో దేశ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇన్నాళ్లూ కులగణన డిమాండ్‌తో మోదీ ప్రభుత్వంపై విరుచుకుపడిన కాంగ్రెస్.. ఇప్పుడు అయోమయంలో పడింది. జనాభా లెక్కల సేకరణతోపాటే కులగణన కూడా జరపాలని మోదీ క్యాబినెట్ ఆకస్మికంగా తీసుకున్న నిర్ణయం ఆ పార్టీని విస్మయానికి గురిచేసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కులగణననే ప్రధాన ప్రచారాస్త్రంగా మార్చుకున్న నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గ నిర్ణయంతో అది బీజేపీ చేతికి వెళ్లిందన్న ఆందోళన ఆ పార్టీ నేతల్లో నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఈ అంశంపై తదుపరి కార్యాచరణను ఖరారు చేసేందుకు ఆ పార్టీ అత్యున్నత నిర్ణాయక విభాగమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శుక్రవారం ఢిల్లీలో భేటీకానుంది. దీనిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం మీడియాతో మాట్లాడారు. వర్కింగ్ కమిటీ కులగణన, పహల్గాం ఉగ్రదాడిపై విస్తృతంగా చర్చిస్తుందన్నారు. కులగణనను ఆమోదిస్తూ ప్రభుత్వం 'హెడ్‌లైన్' ఇచ్చిందని.. కానీ దాని అమలుకు డెడ్‌లైన్ ఎక్కడని ప్రశ్నించారు. పహల్గాం దాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై గట్టి చర్య తీసుకోవాలన్న డిమాండ్ల నేపథ్యంలో కులగణనపై నిర్ణయం పక్కదోవ పట్టించే ఎత్తుగడగా అభివర్ణించారు. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని రద్దుచేస్తూ నిర్ణయం తీసుకోకుండా ఎవరు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. ఇందుకోసం పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ పర్యటనకు వెళ్తున్నారు. ఈ రోజు సాయంత్రం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణయాక విభాగమైన సీడబ్ల్యూసీ సమావేశంలో రేవంత్ పాల్గొంటారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఢిల్లీలో నిర్వహించే తొలి సీడబ్ల్యూసీ సమావేశం ఇది. శాసనసభ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుపై జాతీయ నాయకత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి సమగ్రంగా వివరిస్తారని తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ.. ఎప్పటి నుంచో కులగణన చేపట్టాలని దేశవ్యాప్తంగా పోరాటం చేస్తున్నారు. కుల గణననే ప్రధాన అస్త్రంగా ఆయన తన రాజకీయ కార్యకలాపాలు నడిపారు. అయితే కేంద్రం మాత్రం కులగణన పట్ల సుముఖత వ్యక్తం చేయలేదు. కానీ అనూహ్యంగా కేంద్రం తన వైఖరిని మార్చుకుంది. 2011 తర్వాత 2021లో జనగణన చేపట్టాల్సి ఉండగా.. కరోనా కారణంగా నిర్వహించలేదు. కాబట్టి జనగణనతో పాటు కుల గణన కూడా చేపట్టాలన్న కేంద్రం నిర్ణయంతో కాంగ్రెస్ పార్టీ దగ్గర ఉన్న ఏకైక అస్త్రం కూడా లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కుల గణనతోపాటు పహల్గామ్ ఉగ్ర దాడి, బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంపై తమ పార్టీ వైఖరిని ఈ సమావేశంలో ఖరారు చేయనున్నట్టు తెలుస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన కులగణన విజయవంతం కావడమే కాకుండా దేశానికి ఆదర్శంగా నిలిచిందని సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్నారు. ఇదే విషయాన్ని సీడబ్ల్యూసీ సమావేశంలో ఆయన ప్రస్తావించనున్నారు. తమని కేంద్రం సంప్రదిస్తే సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు. పహల్గామ్ ఉగ్ర దాడితో దేశం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. కేంద్ర ప్రభుత్వ వైఫల్యంతోనే ఉగ్ర దాడి జరిగిందని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఆరోపిస్తోంది. అంతేకాకుండా పాకిస్తాన్‌పై గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది. పహల్గామ్ ఘటనను పక్కదోవ పట్టించడం కోసమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన డిమాండ్డైన కుల గణనను బీజేపీ తెరపైకి తెచ్చిందని కాంగ్రెస్ పార్టీ అనుమానిస్తోంది. దేశవ్యాప్తంగా ఎక్కువగా డిమాండ్ ఉన్న బీసీ రిజర్వేషన్ల పెంపుపై ఈ సీడబ్ల్యూసీ సమావేశంలో చర్చించనున్నారు. ఎప్పటి నుంచో బీసీ రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా ఉన్న 50శాతం రిజర్వేషన్ల పరిమితిని రద్దు చేసి, పార్లమెంటులో రాజ్యాంగ సవరణ చేయాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. బీసీ అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పలు సందర్భాల్లో చెప్పారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల కోసం ఎవరితోనైనా కలిసి పనిచేస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్తోంది. పహల్గామ్ ఉగ్రదాడి జరిగి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం వద్ద స్పష్టమైన వ్యూహం కొరవడిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో ప్రధానంగా రెండు అంశాలపై చర్చించినట్లు ఖర్గే తెలిపారు. కుల గణనపై తమ డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించడంపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. ప్రజా సమస్యలపై నిజాయతీగా పోరాడితే, మొండి ప్రభుత్వమైనా తలవంచక తప్పదని రాహుల్ గాంధీ నిరూపించారని పేర్కొన్నారు. అయితే, కులగణన ప్రక్రియ పూర్తయ్యేంత వరకు పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతించినప్పటికీ, దానిని ప్రకటించిన సమయం మాత్రం ఆశ్చర్యానికి గురిచేసిందని ఖర్గే వ్యాఖ్యానించారు. తమ పార్టీ డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గిందని, అయితే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశాలపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆయన అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడి అనంతర పరిస్థితులు, భద్రతా వైఫల్యాలపై కూడా సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. దేశ ఐక్యత, సమగ్రతకు భంగం కలిగించే ఉగ్రవాద చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఉగ్రవాదంపై పోరులో కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీతో పాటు విపక్షాలన్నీ మద్దతుగా నిలుస్తాయని మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను రాహుల్ గాంధీ పరామర్శించారని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని, మృతులకు అమరవీరుల హోదా కల్పించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు. దేశ భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, ఉగ్రవాదాన్ని సమష్టిగా ఎదుర్కోవాలని సీడబ్ల్యూసీ అభిప్రాయపడినట్లు ఖర్గే వివరించారు.

# మాకు నిజాయతీనే ముఖ్యం.. ట్రంప్ చర్చల ప్రతిపాదనపై డ్రాగన్

మొదటి పేజీ తరువాయి



ఈ కబురు,బీజింగ్: అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం నెలకొన్న విషయం తెలిసిందే. టారిఫ్‌లపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపేందుకు అమెరికా అధికారుల బృందం చైనా అధికారులను సంప్రదించింది. తాజాగా ఈ విషయంపై బీజింగ్ స్పందిస్తూ.. వాషింగ్టన్ ఇటీవల తీసుకున్న వాణిజ్య విధాన నిర్ణయాలు, సుంకాల తగ్గింపు విషయంపై అగ్రరాజ్యంతో చర్చలు జరపాలా..? వద్దా.. అని యోచిస్తున్నట్లు వెల్లడించింది. ''టారిఫ్ సమస్యలపై బీజింగ్‌తో చర్చలు జరపాలనే ఆశను వ్యక్తంచేస్తూ అమెరికా సంబంధిత వర్గాల ద్వారా అనేకసార్లు సందేశాలను పంపింది. దీంతో చర్చల విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోవాలనే విషయాన్ని అధికారులతో సంప్రదించి ఓ అంచనాకు వస్తాము'' అని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది.

అయితే తమపై టారిఫ్ విధిస్తూ.. వాణిజ్య యుద్ధాన్ని అమెరికా ఏకపక్షంగా ప్రారంభించిందని వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి అన్నారు. ఇప్పుడు ఆ దేశం తమతో చర్చలు జరపాలంటే తమతో నిజాయతీగా ఉండాలని తెలిపారు. బీజింగ్‌తో వ్యవహరిస్తున్న తప్పుడు పద్ధతులను సరిదిద్దుకొని.. తమపై విధించిన ఏకపక్ష సుంకాలను ఎత్తివేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే అమెరికాతో బీజింగ్ సానుకూల చర్యలు చేపడుతుందని తెలిపారు.

మరోవైపు చైనానే టారిఫ్‌లపై చర్చల కోసం తీవ్రస్థాయిలో యత్నిస్తోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారు. బుధవారం కూడా ఆయన మాట్లాడుతూ డీల్ కుదుర్చుకోవడానికి బలమైన అవకాశాలున్నాయని చెప్పారు. ''చర్చల్లో మా నిబంధనలకు లోబడే ఒప్పందం చేసుకోనున్నాం. అదే మంచిది'' అని ఆయన న్యూస్‌నేషన్ టౌన్ హాల్ కార్యక్రమంలో వెల్లడించారు. దాదాపు వారం రోజుల క్రితం ట్రంప్ ఇటువంటి ప్రకటనే చేయగా.. చైనా బహిరంగానే ఖండించింది. నాడు బీజింగ్ ప్రతినిధి గువో జియాకున్ మాట్లాడుతూ ''ఇరుదేశాల మధ్య సంప్రదింపులు ఏమీ జరగడం లేదు. వాణిజ్య ఒప్పందం కుదరలేదు'' అని చెప్పారు. అయితే ఈ అంశంపై భవిష్యత్తులో చర్చలకు సిద్ధమే అని చెప్పడం విశేషం. అయితే తాము చేసిన కొత్త వాణిజ్య ఒప్పందాల గురించి తమతో చర్చించడానికి 75 కంటే ఎక్కువ దేశాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని వైట్‌హౌస్ పేర్కొంది.

అధికారంలోకి వచ్చినప్పటినుంచి చైనాపై టారిఫ్‌ల కొరడా విసురుతున్న ట్రంప్ .. బీజింగ్ నుంచి దిగుమతి చేసుకొనే వస్తువులపై సుంకాన్ని 145 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిగా చైనా కూడా అగ్రరాజ్య ఉత్పత్తులపై 125 శాతం టారిఫ్‌లు ప్రకటించింది. దీంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య విభేదాలు భగ్గుమన్నాయి.

మొదటి పేజీ తరువాయి

# నా పక్కన శశి థరూర్.. వాళ్లకు నిద్రపట్టదేమో': మోదీ వ్యంగ్యాస్త్రాలు

**"దిల్లీ ఎయిర్‌పోర్టులో విమానాల ఆలస్యం ఉన్నప్పటికీ.. సమయానికి తిరువనంతపురం చేరుకోగలిగా. నా నియోజకవర్గానికి వచ్చిన మోదీని సాదరంగా స్వాగతించా" అని థరూర్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.**

భారత్‌లో సృష్టిద్దాం.. జగతికి అందిద్దాం

కాంగ్రెస్ అధినాయత్వంతో శశిథరూర్ బంధం బీటలు వారుతున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్న సంగతి తెలిసిందే. గత కొన్ని నెలలుగా థరూర్ తన సొంత పార్టీపై బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.  ఈ క్రమంలోనే ఆ మధ్య ఓ కేంద్ర మంత్రితో ఆయన సెల్ఫీ దిగడంతో థరూర్ పార్టీ మారనున్నట్లు ప్రచారం మొదలైంది. ఇక, భారత విదేశాంగ విధానాన్ని ప్రశంసిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఈ పరిణామాల వేళ ఆయన మోదీతో వేదిక పంచుకోవడం చర్చనీయాంశమైంది.

ఈ కార్యక్రమంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ఈ సీపోర్ట్‌తో కేరళలో ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యం, షిప్పింగ్‌లో భారత పాత్రను గణనీయంగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



# విద్యుత్ శాఖలో మీటర్ల గోల్ మాల్






పోలీసులు స్వాధీనం చేసుకున్న విద్యుత్ మీటర్లు

**విద్యుత్ మీటర్లను పక్కదారి పట్టించి చిత్రపురి కాలనీలో దాచిన కాంట్రాక్టర్**

**దాడులు చేసి 42 విద్యుత్ మీటర్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : విద్యుత్ శాఖలో మీటర్ల గోల్ మాల్ వ్యవహారం సంచలనంగా మారింది. వినియోగదారులకు రిలీజ్ అయిన సర్వీసు మీటర్ల ను ఒక కాంట్రాక్టర్ పక్కదారి పట్టించాడు. కాంట్రాక్టర్ తీరుపై అనుమానం తో విద్యుత్ శాఖ అధికారులు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేయగా అసలు విషయం వెలుగు చూసింది. అధికారుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు చిత్రపురి కాలనీలోని ఓ ఇంటిపై దాడి చేసి కాంట్రాక్టర్ దాచి ఉంచిన 42 విద్యుత్ మీటర్లను స్వాధీనం చేసుకున్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.
విద్యుత్ శాఖ ఇబ్రహీం బాగ్ డివిజన్ పరిధిలో కొత్తగా విద్యుత్ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మీటర్లు అందడం లేదని గత కొంతకాలంగా పలు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారించిన ఇబ్రహీం బాగ్ ఏడిఈ అంబేద్కర్ విద్యుత్ మీటర్ల కొరతకు కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డి కారణమని గుర్తించాడు.
గచ్చిబౌలి పరిధిలోని టెలికాం నగర్ లో ఉంటున్న చెన్నకేశవరెడ్డి విద్యుత్ శాఖలో మీటర్ల కాంట్రాక్టర్ గా పనిచేస్తుండగా, వినియోగదారులకు మంజూరైన విద్యుత్ మీటర్లను పక్కదారి పట్టించాడు. ఈ విషయం గ్రహించిన ఏడిఈ అంబేద్కర్ విచారణ చేపట్టగా, టెలికాం నగర్ లోని చెన్నకేశవరెడ్డి ఇంట్లో మీటర్లను దాచి ఉంచినట్టు సమాచారం అందుకున్నాడు. ఈ మేరకు ఏడిఈ అంబేద్కర్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో రాయదుర్గం పోలీసులు టెలికాం నగర్ లోని చెన్నకేశవరెడ్డి ఇంట్లో సోదాలు చేపట్టగా మీటర్లు లభించలేదు. అక్కడ ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ ఆటోలో మీటర్లను లోడ్ చేసిన విషయం గమనించిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సదరు ఆటోలో మీటర్లను తరలించి చిత్రపురి కాలనీలో విలువ చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు చిత్రపురి కాలనీ ఇంటిపై శుక్రవారం దాడులు నిర్వహించిన రాయదుర్గం పోలీసులు మొత్తం 42 విద్యుత్ మీటర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందం: జేడీ వాన్స్

**త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం సాకారమవుతుందని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ అన్నారు.**

ఈ కబురు: భారత్ అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపై తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందిస్తూ..త్వరలోనే భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ప్రకటించారు. పరస్పర సుంకాలను నివారించడానికి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న మొదటి దేశాల్లో భారత్ కూడా ఉండొచ్చని అన్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ గురించి మాట్లాడుతూ..మోదీ చాలా మెరుగ్గా బేరసారాలు ఆడతారని, అందుకే తాము ఆయనను గౌరవిస్తామని అన్నారు. భారత్ యూఎస్‌కు వ్యవసాయ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం వల్ల తమ దేశంలోని రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వాన్స్ అన్నారు. కానీ, భారత్ మాత్రం తమ దేశం నుంచి ఎన్నో ఏళ్లుగా ప్రయోజనం పొందుతోందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం వంటి విషయాలపై భారత్‌తో చర్చిస్తున్నామన్నారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్‌తో పాటుగా జపాన్, కొరియా వంటి దేశాలతోనూ చర్చలు జరుపుతున్నామని వాన్స్ పేర్కొన్నారు.
ఇటీవల జేడీ వాన్స్ భారత పర్యటనకు వచ్చిన సమయంలో ప్రధాని నరేంద్ర మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై ఇరుదేశాల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంధనం, వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందని అభిప్రాయం వ్యక్తంచేశారు. రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సమతుల్యాన్ని కొనసాగించేందుకు అమెరికా నుంచి చమురు, గ్యాస్‌ల దిగుమతి పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు ఇటీవల పేర్కొన్నారు. ట్రంప్ సైతం భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. వాన్స్ తాజా ప్రకటనతో త్వరలోనే ఒప్పందం ఖరారుపై ప్రకటన వెలువడే అవకాశాలు కన్పిస్తున్నాయి.



## యూపీ గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారత వైమానిక దళ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ డ్రిల్



**యూపీ గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై భారత వైమానిక దళ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ డ్రిల్**

ఈ కబురు: భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగిన వేళ మనదేశ వైమానిక దళ యుద్ధ విమానాలు అత్యవసర పరిస్థితుల్లో టేకాఫ్, ల్యాండింగ్ కోసం సాధన చేస్తున్నాయి. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌లోని గంగా ఎక్స్‌ప్రెస్‌వేపై సుమారు 3.5 కిలోమీటర్ల ఎయిర్‌స్ట్రిప్‌పై 'ల్యాండ్ అండ్ గో' డ్రిల్ నిర్వహించాయి. రన్‌వేకు ప్రత్యామ్నాయంగా ఎంత మేరకు పనిచేస్తుందనే అంశాన్ని గంగా ఎక్స్‌ప్రెస్‌వేను పరిశీలించారు. ఇది దేశ రక్షణ సంసిద్ధతలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. యుద్ధ విమానాల పగటిపూట మాత్రమే కాకుండా రాత్రి సమయంలో కూడా ల్యాండింగ్‌లను సులభతరం చేసే ప్రత్యేక సామర్థ్యంతో ఈ ఎక్స్‌ప్రెస్‌వే స్ట్రెచ్‌ను నిర్మించారు. దీంతో ఈ ఎక్స్‌ప్రెస్‌వే దేశంలోనే మొట్టమొదటి ఎయిర్‌స్ట్రిప్‌గా నిలిచింది. ఇదివరకు, లక్నోఆగ్రా, పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేలలో కూడా ఇలాంటి అత్యవసర ల్యాండింగ్ డ్రిల్‌లు నిర్వహించారు, కానీ అవి పగటిపూట మాత్రమే చేశారు. పగటి పూట సాధారణ వేళల్లో పరీక్షలు జరుగుతుండగా, రాత్రి సమయంలో మాత్రం 710 గంటల మధ్య నిర్వహిస్తారు. ఎక్స్‌ప్రెస్‌వేపై యుద్ధ విమానాల ప్రదర్శనలను చూడటానికి వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు, స్థానికులు తరలివచ్చారు. ట్రయల్స్ నిర్వహించిన వాటిలో రఫెల్, ఎస్‌యూ30 ఎంకెఐ, మిరాజ్ 2000, ఎంఐజీ29, జాగ్వార్, సీ130జే సూపర్ హెర్క్యులస్, ఏఎన్32, ఎంఐ17 వీ5 హెలికాప్టర్‌తో సహా అనేక రకాల ఐఏఎఫ్ విమానాలు ఉన్నాయి. భద్రత, నిఘాను దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌ప్రెస్‌వేలో 250కి పైగా సీసీటీవీ కెమెరాలు అమర్చారు. కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ఉన్నతస్థాయి రక్షణ, రాష్ట్ర అధికారులు హాజరయ్యారు.



# నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే మా లక్ష్యం: డిప్యూటీ భట్టి

ఈ కబురు: అభివృద్ధి పథంలో ముందుకు పోతూనే.. యువతకు ఉపాధి చూపే ఉద్యోగాల గనిగా రూపుదిద్దుకోవాలని ఆ దిశగా కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. మన ముందు తరాల వారు ఆరోగ్యంగా, ఆర్థికంగా బలమైన సింగరేణి సంస్థను మనకు అందించారని, మనం కూడా మన వారసులకు ఉజ్వల సింగరేణిని అందించకపోతే భావి తరాలకు తీరని నష్టం చేసిన వాళ్లం అవుతామని హెచ్చరించారు. సింగరేణి అభివృద్ధిలో కింది ఉద్యోగి నుంచి సీఎండీ వరకు అందరికీ సమాన బాధ్యత ఉంటుందని, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూ ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. ఉద్యోగులకు కష్టంగా ఉంటుందని ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల రాబోయే రోజుల్లో ఇబ్బందుల పాలవుతామని, నిబంధనలతో, శ్రమతో కూడిన అడుగులు వేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన సింగరేణి కారుణ్య నియామకాల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల లబ్ధి పొందిన వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

కారుణ్య ఉద్యోగాలలో గరిష్ట వయోపరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరిన ఎదుట దీనిపై తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి అంగీకరించామని, దీనివల్ల 35 సంవత్సరాల వయో పరిమితి దాటిన అనేక వందల మందికి ఉద్యోగాలు లభించే అదృష్టం దక్కిందన్నారు. నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. సింగరేణి సంస్థ నేడు పోటీ మార్కెట్ టో ఇతరులతో పోటీపడి నిలవాల్సిన పరిస్థితి ఉందని, కనుక సింగరేణి కార్మికులు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ పూర్తి పనిగంటలు పనిచేస్తూ కంపెనీని కాపాడుకోవాలని భవిష్యత్తు తరాలకు దీనిని ఒక వారసత్వంగా అందించాలన్నారు. సింగరేణిని ఇతర రంగాల్లోకి, ఇతర రాష్ట్రాల్లోకి కూడా విస్తరిస్తున్నామని, ఈ ప్రణాళికలు విజయవంతం కావాలంటే ప్రతీ ఒక్కరూ శ్రమ శక్తిని చాటాలన్నారు. కొత్తగా ఉద్యోగంలో చేరిన సింగరేణి వారసులు తేలికపాటి ఉద్యోగం కోసం విఫల ప్రయత్నాలు చేయకుండా, ఇచ్చిన పనిని సమర్థంగా నిర్వహిస్తూ కంపెనీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

అదే సమయంలో తమ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో 9 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినం జూన్ 2వ తేదీన పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇది లక్షల మందికి ఉపాధి లభించే బృహత్ పథకంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా సడలించిన వయోపరిమితి ద్వారా కారుణ్య నియామకం పొందిన 21 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకారం అందిస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా వయో పరిమితి సడలింపునకు అంగీకరించి, అనేక కుటుంబాల్లో వెలుగు నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి సహకరిస్తుందని, కాంట్రాక్టు కార్మికులకు కూడా రూ.5 వేల బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. దేశంలో ఏ బొగ్గు సంస్థల్లో లేని విధంగా సింగరేణిలో వయో పరిమితిని 40 ఏళ్లకు పెంచడం కూడా ఇక్కడే సాధ్యమైందిఅన్నారు. గతంలో ఏ రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి కృషి చేయనివిధంగా తెలంగాణలో మంత్రి భట్టి విక్రమార్క సంస్థ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరో ఆరు గనులు.. 20వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆశిస్తున్నట్లు జనక్‌ప్రసాద్‌తెలిపారు



# హీటెక్కిన కులగణన రాజకీయం.. గవర్నర్ ను కలిసిన టీ కాంగ్రెస్ బీసీ నేతలు





**హీటెక్కిన కులగణన రాజకీయం.. గవర్నర్ ను కలిసిన టీ కాంగ్రెస్ బీసీ నేతలు**

ఈ కబురు: రాబోయే జనాభా లెక్కలతో పాటే కులగణన నిర్వహించేందుకు సిద్ధం అని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనతో 'క్యాస్ట్ సెన్సస్ పాలిటిక్స్' హీటెక్కుతున్నాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించి తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆమోదం తెలిపి దానిని రాష్ట్రపతికి పంపడంపై తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు ఇవాళ గవర్నర్ ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇవాళ రాజ్ భవన్ కు వెళ్లిన కాంగ్రెస్ నేతలు గవర్నర్ ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్.. దేశవ్యాప్తంగా కులగణన జరపాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని బలహీన వర్గాలకు చెందిన వారందరం స్వాగతిస్తున్నామని చెప్పారు. కులగణన తెలంగాణ దేశానికి రోల్ మోడల్ గా నిలిచిందని, కులగణనను గతంలో విమర్శించినవారే ఇప్పుడు ఆదర్శంగా తీసుకున్నారన్నారు. రాహుల్ గాంధీ పోరాట ఫలితమే కేంద్ర కేబినెట్ నిర్ణయం అని రాహుల్ గాంధీ నినాదం ఇప్పుడు ఆచరణలోకి వచ్చిందన్నారు. రేవంత్ పాలనలో కులగణన జరగడంతో కేంద్రం దిగి వచ్చిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన కులగణనను కేంద్ర ప్రభుత్వం ఆదర్శంగా తీసుకుంటే బీజేపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు.

# మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లలో విషాదం



కాలిన గాయాలతో ఉపేందర్

**విద్యుత్ వైర్లు తొలగిస్తుండగా యువకుడికి విద్యుత్ షాక్**

ఈకబురు, శేరిలింగంపల్లి : నగరంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీల ఏర్పాట్లలో విషాదం చోటుచేసుకుంది. రహదారులపై చిందరవందరగా ఉన్న విద్యుత్ కేబుల్ వైర్ల తొలగింపు పనులు చేపడుతుండగా కాంట్రాక్టు కార్మికుడికి విద్యుత్ షాక్ తగిలింది. తీవ్ర గాయాలు కావడంతో ప్రస్తుతం యువకుడు ఆసుపత్రులు చికిత్స పొందుతున్నాడు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలం రుంకు హనుమంతపురం గ్రామానికి చెందిన వై. ఉపేందర్ (23) మూసాపేట్ ప్రగతినగర్‌కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉపేందర్ గత మూడు సంవత్సరాలుగా టీజీఎస్‌పిడిసిఎల్ లో కాంట్రాక్ట్ డ్రైవర్ గా విధులు నిర్వహించడంతో పాటు ఎలక్ట్రికల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. కాగా నగరంలో ఈ నెల 10వ తేది నుండి మిస్ వరల్డ్ పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ మెగా ఈవెంట్ కోసం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రధాన రహదారుల వెంబడి చిందరవందరగా ఉన్న కేబుల్, విద్యుత్ వైర్లను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్రవారం గచ్చిబౌలి ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న జీప్ షోరూం వద్ద విద్యుత్ కాంట్రాక్టర్ సిబ్బందితో కేబుల్ వైర్లను తొలగించే పనిచేస్తున్నారు. ఉపేందర్ కూడా ఈ కేబుల్ వైర్లను తొలగించే పని చేస్తుండగా మధ్యాహ్నం 12 గంటల సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే తోటి కార్మికులు విద్యుత్ శాఖ అధికారుల సహాయంతో సమీపంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఉపేందర్ రెండు చేతులు, తల, కుడి కాలికి 40 శాతం గాయాలు అయ్యాయని వైద్యులు తెలిపారు. ఈ మేరకు పిర్యాదు అందుకున్న గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# గచ్చిబౌలిలో ఘనంగా బీఎన్ఐ జాగ్వార్ సమావేశం




ప్రతిభ కనబర్చిన ప్రతినిధులను సన్మానిస్తున్న దృశ్యం



సమావేశానికి హాజరైన వ్యాపార సంస్థల ప్రతినిధులు

**వ్యాపారాన్ని విస్తరించాలనుకునే వారికి బీఎన్ఐ వేదిక : సంజనా షా**

ఈకబురు, శేరిలింగంపల్లి : బిజినెస్ నెట్‌వర్క్ ఇంటర్నేషనల్ (బీఎన్ఐ) ఆధ్వర్యంలో గచ్చిబౌలి లోని సంధ్య కన్వెన్షన్ సెంటర్‌లో బీఎన్ఐ జాగ్వార్ సమావేశం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి నగరంలోని పలు ప్రముఖ కంపెనీల సీఈఓలు, వ్యాపారవేత్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బీఎన్ఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజన షా మాట్లాడుతూ ఎటువంటి వ్యాపారం చేయాలనుకుంటున్న వారికైనా తమ వ్యాపారాన్ని విస్తరించుకోవడానికి బీఎన్ఐ చక్కటి వేదిక అన్నారు. ఈ వేదిక ద్వారా ఎటువంటి ఛార్జీలు లేకుండా సహాయం చేస్తుందని తెలిపారు. బీఎన్ఐ విశిష్టమైన ప్లాట్ ఫామ్ తో వ్యాపార యజమానులు ఒకరికొకరు సహకరించుకుంటూ, కొత్త వ్యాపార అవకాశాలను పొందవచ్చని అన్నారు. బీఎన్ఐ ఏరియా డైరెక్టర్ సతిష్ మాట్లాడుతూ బీఎన్ఐ అతిపెద్ద చాప్టర్‌గా జాగ్వార్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద బిజినెస్ రెఫరల్ ప్లాట్‌ఫామ్‌గా బీఎన్ఐ అన్ని రంగాల్లోని వ్యాపారాలు అభివృద్ధి చెందడానికి ఉత్తమమైన వేదిక అని ఆయన పేర్కొన్నారు. వ్యాపారంలో రాణించాలనుకునే వారికి బీఎన్ఐ ఒక బలమైన పునాదిని అందిస్తుందని తెలిపారు.

# మే కార్ల సందడి: ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్.. విండ్‌సోర్ 'బిగ్' అప్‌డేట్..!




**మే నెలలో కార్లకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ రాబోతున్నాయి. ఆ వివరాలు ఇవీ..**

ఆటోమొబైల్ ఇండస్ట్రీలో మే నెలలో సందడి వాతావరణం కనిపించనుంది. కొత్తగా అప్‌డేట్‌లు ఏవీ లేకపోవడంతో ఏప్రిల్ నెల చప్పగా సాగిపోయింది. ఈ నెలలో మాత్రం కార్లకు సంబంధించిన కొన్ని అప్‌డేట్స్ వాహన ప్రియులను అలరించనున్నాయి. ఆ వివరాలు ఇవీ..


టాటా ఆల్ట్రోజ్
టాటా మోటార్స్‌కు చెందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ టాటా ఆల్ట్రోజ్ ఫేస్‌లిఫ్ట్ ఈనెల రాబోతోంది. ఎక్స్‌టీరియర్ పరంగా బంపర్లు, అలాయ్ వీల్స్ వంటి చిన్నచిన్న మార్పులతో రాబోతున్న ఈ కారులో ఇంటీరియర్ పరంగా చాలావరకు మార్పులు చేయనున్నట్లు సమాచారం. సీఎన్‌జీ, పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్లతో లభించబోతోంది. మే 21న కొత్త ఫేస్‌లిఫ్‌ట్‌ను లాంచ్ చేసే అవకాశం ఉంది.

కరెన్స్.. క్లావిస్‌గా
కియా కరెన్స్ ఫేస్‌లిఫ్ట్ క్లావిస్‌గా మార్కెట్‌లోకి ఎంట్రీ ఇవ్వనుంది. మే 8న దీన్ని ఆన్‌లైన్‌లో ఆవిష్కరించనున్నారు. జూన్ 2న ధర వెల్లడి కానుంది. 360 డిగ్రీల కెమెరా, ఆరు ఎయిర్‌బ్యాగులతో పాటు లెవల్2 అడాస్ ఫీచర్లతో ఈ కారు రాబోతోంది. పనోరమిక్ సన్‌రూఫ్, 12.3 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్‌తో వస్తోంది. పెట్రోల్, టర్బో పెట్రోల్, డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో ఈ ఎంపీవీ లభించనుంది.

విండ్‌సోర్ అధిక రేంజ్‌తో..
జేఎస్‌డబ్ల్యూ ఎంజీ తన విండ్‌సోర్ ఈవీని మరింత బిగ్ బ్యాటరీతో తీసుకురాబోతోంది. ప్రస్తుతం 38kWh బ్యాటరీతో లభిస్తున్న ఈ కారులో కొత్తగా 50.6kWh సామర్థ్యం కలిగిన బ్యాటరీ ఇవ్వనున్నారు. దీంతో ఆ మేర రేంజ్ పెరగనుంది. ఎంజీ మాతృ సంస్థ సియాక్‌కు చెందిన వులింగ్ క్లౌడ్ ఈవీకి అనుగుణంగా బిగ్‌బ్యాటరీతో విండ్‌సోర్ కారును తీసుకురానున్నారు. ఇది మే నెలలోనే రాబోతున్నప్పటికీ.. తేదీ మాత్రం ఇంకా వెల్లడి కాలేదు.

ఫోక్స్‌వ్యాగన్ గోల్ఫ్ జీటీఐ
జర్మన్ కార్ల తయారీ సంస్థ గోల్ఫ్ జీటీఐ మోడల్‌ను ఇదే నెలలో లాంచ్ చేయనుంది. పోలో జీటీఐ తర్వాత జీటీఐ బ్యాడ్జ్‌తో వస్తున్న రెండో మోడల్ ఇది. దీన్ని నేరుగా దిగుమతి చేసి దేశీయంగా విక్రయించనున్నారు. 2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో వస్తున్న ఈ కారు 261 బీహెచ్‌పీ పవర్‌ను, 370 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. వీటితో పాటు మెర్సిడెస్‌బెంజ్, ఆడి, బీఎండబ్ల్యూ నుంచి కూడా అప్‌డేట్స్ ఉండొచ్చని ఆటోమొబైల్ వర్గాలు చెబుతున్నాయి.

# ఆడి కార్ల ధర పెంపు.. ఎప్పటినుంచంటే?



**తమ కంపెనీకి చెందిన అన్ని రకాల కార్లపై రెండు శాతం వరకు ధరలను పెంచుతున్నట్లు ఆడి ఇండియా ప్రకటించింది.**

ప్రముఖ లగ్జరీ వాహన తయారీ సంస్థ ఆడి వాహన ధరల్ని పెంచనుంది. భారత్‌లో విక్రయిస్తున్న అన్నిరకాల మోడళ్లపై 2 శాతం వరకు ధరను పెంచనున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు మే 15 నుంచి అమల్లోకి రానున్నట్లు స్పష్టంచేసింది. నిర్వహణ వ్యయాలను సర్దుబాటు చేయడం కోసమే ఈ నిర్ణయం తీసుకొన్నట్లు కంపెనీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. భారత్‌లో ఆడి.. ఏ4, క్యూ5, క్యూ7, ఆర్ఎస్ ఇట్రాన్ జీటీ వంటి ప్రముఖ మోడళ్లను విక్రయిస్తోంది.

# ఈ పోస్టల్ స్కీమ్స్‌కు ఆధార్‌తో ఈకేవైసీ.. పేపర్ వర్క్ అవసరం లేదిక!




**పోస్టల్ శాఖ డిజిటల్ రూపు సంతరించుకుంటోంది. ఇందులో భాగంగా కొన్ని పథకాల ప్రారంభానికి పేపర్ వర్క్ అవసరం లేకుండా చేసింది.**

పోస్టాఫీసు పథకాల్లో చేరే ప్రక్రియను తపాలా శాఖ మరింత సులభతరం చేసింది. మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, టైమ్ డిపాజిట్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి ఖాతాలను పూర్తి డిజిటల్ పద్ధతిలో తెరిచే సదుపాయాన్ని తీసుకొచ్చింది. కేవలం ఆధార్ బయోమెట్రిక్ సాయంతో ఆయా ఖాతాలు సులువుగా తెరిచే వెసులుబాటును కల్పించింది. పేపర్ వర్క్ అవసరాన్ని తప్పించింది.

పోస్టాఫీసు సేవింగ్స్ అకౌంట్ తెరవడానికి ఈ ఏడాది జనవరి నుంచి ఆధార్ బేస్డ్ ఈకేవైసీ విధానాన్ని తపాలాశాఖ అనుసరిస్తోంది. ఏప్రిల్ 24 నుంచి దీన్ని మంత్లీ ఇన్‌కమ్ స్కీమ్, టైమ్ డిపాజిట్ స్కీమ్, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి పాపులర్ పథకాలకూ విస్తరించింది. ఈమేరకు తాజాగా ఓ సర్క్యులర్ జారీ చేసింది. పోస్టాఫీసు కార్యాలయాల్లో ఆయా ఖాతాలన్నీ ఆధార్ ఈకేవైసీ సాయంతో సులువుగా తెరవొచ్చని పేర్కొంది.

తగ్గనున్న పేపర్ వర్క్
ప్రస్తుత పద్ధతితో వీటిల్లో ఏదైనా ఖాతాను తెరవాలంటే డిపాజిట్ వోచర్, ఫిజికల్ ఫారాలు నింపాల్సి ఉంటుంది. ఇకపై పోస్టాఫీసుల్లో రెండు పద్ధతులూ అందుబాటులో ఉంటాయి. ఇందులోభాగంగా ఈ ఖాతాలను తెరవడానికి వెళ్లినప్పుడు పోస్టల్ అసిస్టెంట్ తొలుత డిపాజిటర్ నుంచి బయోమెట్రిక్ (ఫింగర్ ప్రింట్) వివరాలు సేకరిస్తారు. తర్వాత పేరు, స్కీమ్ టైప్, డిపాజిట్ మొత్తం వంటి వివరాలు నమోదు చేస్తారు. వివరాలన్నీ ధ్రువీకరించుకున్నాక తుది సబ్మిషన్ కోసం మరోసారి మీ నుంచి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు. దీంతో మీ లావాదేవీ పూర్తవుతుంది. ఈక్రమంలో డిపాజిట్ ఫారం కూడా నింపాల్సిన అవసరం లేదు. అంతేకాదు వివరాల నమోదు ప్రక్రియలో ఆధార్‌లోని తొలి 8 నంబర్లను పోస్టల్ సిబ్బంది మాస్క్ చేస్తారు. చివరి నాలుగు నంబర్లు మాత్రమే సేకరిస్తారు. భద్రతపై కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తపాలా శాఖ పేర్కొంది.

# సుంకాల ఎఫెక్ట్.. యాపిల్‌పై 900 మిలియన్ డాలర్ల ప్రభావం!



**అమెరికా సుంకాల ప్రభావంతో యాపిల్ కంపెనీకి నష్టం కలిగించే అవకాశం ఉందని కంపెనీ సీఈఓ టిమ్ కుక్ తెలిపారు.**

ఐఫోన్ తయారీ కంపెనీ యాపిల్ ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. విశ్లేషకులు ఊహించిన దానికంటే మెరుగైన ఫలితాల్ని నమోదు చేసింది. అయితే రానున్న త్రైమాసికంలో అమెరికా సుంకాల కారణంగా కంపెనీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలిపింది. తమ సప్లై చెయిన్‌ను ఇది దెబ్బతీసే అవకాశం ఉందని వెల్లడించింది. సుంకాల వల్ల కంపెనీపై 900 మిలియన్ డాలర్ల మేర ప్రభావం పడనున్నట్లు కంపెనీ సీఈఓ టిమ్ కుక్ తెలిపారు.

అమెరికా, చైనా భారీస్థాయిలో పరస్పర సుంకాలు విధించుకోవడంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధం రాజుకుంది. ఈ క్రమంలోనే టారిఫ్‌ల నుంచి తప్పించుకునేందుకు దిగ్గజ సంస్థ యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుకుతోంది. అయితే ప్రతీకార సుంకాల నుంచి ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సెమీ కండక్టర్లను మినహాయించారు.

ఈ నేపథ్యంలో యాపిల్ ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటూ భారత్‌లో ఉత్పత్తిని పెంచింది. ''రానున్న రోజుల్లో సుంకాలపై ఎలాంటి చర్యలు తీసుకొనే అవకాశం ఉందో తెలియదు. దీంతో సుంకాల ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నాం. ప్రస్తుత సుంకాల రేట్లు, విధానాలు మారకపోతే యాపిల్‌పై 900 మిలియన్ డాలర్లు అధిక భారం పడే అవకాశం ఉంది'' అని టిమ్ కుక్ అన్నారు. భారత్‌లో ఉత్పత్తిని మరింత విస్తరించాలని చూస్తున్నట్లు కంపెనీ అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

ఐప్యాడ్, మ్యాక్, యాపిల్ వాచ్, ఎయిర్‌పాడ్ వంటి ఉత్పత్తులు దాదాపుగా వియత్నాంలో ఉత్పత్తి అవుతున్నాయని కుక్ తెలిపారు. అమెరికా వెలుపలి మార్కెట్ కోసం చైనా ఇప్పటికీ ప్రధాన ఉత్పత్తి కేంద్రంగా ఉంటుందని ఆయన స్పష్టంచేశారు. ఇక ప్రస్తుత సంవత్సరం మొదటి త్రైమాసికంలో ఐఫోన్ విక్రయాలు జోరందుకున్నాయి. దీంతో యాపిల్ 95.4 బిలియన్ డాలర్లు ఆదాయం నమోదు చేసింది. ఇందులో చైనా నుంచే 17 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఇక కంపెనీ లాభం 24.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది.

# ₹10 వేలకే వివో నుంచి కొత్త ఫోన్.. 5,500 బ్యాటరీ, ఏఐ కెమెరాతో

**వివో బడ్జెట్ ధరలో కొత్త మొబైల్‌ను లాంచ్ చేసింది. ధర, ఫీచర్లు వివరాలు ఇవే..**

ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ వివో మరో కొత్త మొబైల్‌ను భారత్‌లో విడుదల చేసింది. 'వై' సిరీస్‌లో బడ్జెట్ ధరలో ఈ స్మార్ట్‌ఫోన్‌ను దేశీయ మార్కెట్లోకి తీసుకొచ్చింది. వివో వై19 5జీ పేరిట దీన్ని లాంచ్ చేసింది. 5,500 బ్యాటరీ, ఏఐ కెమెరా ఫీచర్లతో తీసుకురావడం విశేషం.

వై 19 5జీ ఫీచర్ల విషయానికొస్తే.. 6.74 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లే ఇస్తున్నారు. 90Hz రిఫ్రెష్‌రేటు, 700 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో వస్తోంది. ఆక్టా కోర్ మీడియాటెక్ డైమెన్సిటీ 6300 ప్రాసెసర్‌తో వస్తోంది. డ్యూయల్ సిమ్‌తో వస్తోన్న ఈ మొబైల్ ఆండ్రాయిడ్ 15 ఆధారంగా పనిచేస్తుంది. IP64 రేటింగ్ కలిగిఉంటుంది. ఇక కెమెరా పరంగా చూస్తే.. ఇందులో 13 ఎంపీ ప్రధాన కెమెరా ఇచ్చారు. ఏఐ ఎరేజర్.. లాంటి ఫీచర్లు జోడించారు. ఇక సెల్ఫీ కోసం ముందువైపు 5 ఎంపీ కెమెరా అమర్చారు. 5,500 బ్యాటరీతో వస్తోంది.

వివో కొత్త మొబైల్ మూడు వేరియంట్లలో లభిస్తుంది. 4జీబీ+ 64జీబీ వేరియంట్ ధర రూ.10,499 కాగా.. 4జీబీ+ 128జీబీ వేరియంట్ ధర రూ.11,499గా కంపెనీ నిర్ణయించింది. ఇక 6జీబీ+ 128జీబీ వేరియంట్ ధర రూ.12,999గా వివో పేర్కొంది. గ్రీన్, టైటానియమ్ సిల్వర్.. రంగులో ఈ మొబైల్ లభిస్తుంది. వివో ఇండియా ఇస్టోర్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు రిటైల్ దుకాణాల ద్వారా కొనుగోలు చేయొచ్చు. జీరో డౌన్ పేమెంట్‌తో మూడు నెలల పాటు నోకాస్ట్ ఈఎంఐ ఆఫర్



# హైదరాబాద్ పబ్‌లో టాప్ హీరోయిన్... ఊపేస్తోందిగా..



గత ఏడాది లండన్‌లోని ఓ ప్రముఖ రెస్టారెంట్‌లో అతిథులకు అనుకోని షాక్.. అప్పటి దాకా సంగీతం అందిస్తున్న లోకల్ బ్యాండ్ బృందం మధ్యలోకి అనూహ్యంగా దూసుకొచ్చిందో అందమైన యువతి. హఠాత్తుగా మైక్ తీసుకుని పాడడం ప్రారంభించింది. కాసేపట్లోనే అతిథుల హర్షధ్వానాలతో ప్రాంగణం మారుమోగిపోయింది. అప్పట్లో అది అంతర్జాతీయంగా వార్తల్లో నిలిచింది. ఆమె సాదా సీదా యువతి కాదు మరి...భారత చలనచిత్ర రంగంలో టాప్ హీరోయిన్స్‌లో ఒకరైన శృతి హాసన్.
ప్రఖ్యాత నటుడు కమల్ హాసన్ నటి సరికా ఠాకూర్ కుమార్తె శృతి హాసన్, తెలుగు, తమిళం హిందీ చిత్రాల ద్వారా భారతీయ చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. ఆమె రెండు ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ ఏడు సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డులతో సహా అనేక అవార్డులను గెలుచుకుంది. ఇటీవల రజనీకాంత్ నటించి లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన రాబోయే చిత్రం కూలీ షూటింగ్‌ను శ్రుతి హాసన్ పూర్తి చేసింది. ఆమె అంతర్జాతీయ చిత్రం 'ది ఐ' ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో సంచలనం సృష్టిస్తోంది.ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ఇటీవల భారతదేశంలో వెంచ్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుంది కూడా. సానుకూల సమీక్షలను అందుకుంటోంది. ఇలా నటనా పరంగా అనేక రకాల సంచనాలను సృష్టిస్తోన్న శృతి...తన పేరును సార్థకం చేసుకోవాలని అనుకుంటోంది. ఆమె పాటల ప్రపంచంలోనూ తన సత్తా చాటుతూ సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. చిన్నతనంలోనే సంగీత శిక్షణ పొంది పాడటం ప్రారంభించింది తరువాత తన సొంత బ్యాండ్‌ను సైతం ఏర్పాటు చేసుకుంది. నటీమణులలో పాడే వారే తక్కువ అంటే స్వంత బ్యాండ్ కూడా ఉన్న ఏకైక హీరోయిన్ ఆమె మాత్రమే ఆమె పలు చిత్రాలకు సైతం పాడింది. ఈ సంవత్సరంలో రాబోయే కూలీ చిత్రంలో ఆమె పాత్రతో పాటు, మిస్కిన్ దర్శకత్వం వహించి సంగీతం అందించిన విజయ్ సేతుపతి రాబోయే చిత్రం 'ట్రెయిన్' కు కూడా ఆమె తన గాత్రాన్ని అందించింది. 'ఇట్స్ ఎ బ్రేక్ అప్ డా' పాట కోసం రెహమాన్ తో కలిసి పనిచేసింది. నటన గానం కాకుండా, శ్రుతి ఒక పాటల రచయిత కూడా. ఆమె 'ఎడ్జ్,' 'మాన్స్టర్ మెషిన్,' 'ఇనిమెల్' వంటి ప్రసిద్ధ సింగిల్స్‌తో ఇండీ సంగీత రంగంలో గణనీయమైన ప్రభావాన్ని చూపింది. శ్రుతి తన స్పష్టమైన వ్యక్తిత్వం ప్రత్యేకమైన ఫ్యాషన్ సెక్షన్‌కు ప్రసిద్ధి చెందింది.

గాయని శ్రుతి హాసన్ మార్చి 28న హైదరాబాద్‌లోని ప్రముఖ పబ్ కమ్ క్లబ్‌గా పేరున్న ఓడియం బై ప్రిజంలో ప్రత్యక్ష ప్రదర్శన ఇవ్వవలసి ఉంది. వయసు 21 ఏళ్లు అంతకంటే ఎక్కువ ఉన్నవారికి మాత్రమే ప్రవేశం అనే నిబంధనతో ఈ కన్సర్ట్ రాత్రి 8:00 గంటలకు ప్రారంభమై 4 గంటల 30 నిమిషాల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు ప్రకటించారు. టిక్కెట్లు ధరలు 1,000 నుంచి ఆపైన...బుక్‌మై షో ద్వారా విక్రయించారు కూడా అయితే ఏమైంతో ఏమో కానీ... ఆ షో వాయిదా పడింది. ఆ తర్వాత ఏప్రిల్ 28న శృతి హాసన్ ప్రదర్శన ఉంటుందని తిరిగి అనౌన్స్ చేశారు. అది కూడా వాయిదా పడింది. ఇప్పుడు మరోసారి మే 3న శృతి రానున్నట్టు చెప్పారు. హైదరాబాద్‌కు రానున్న శ్రుతి, తన అభిమానులను ఆకట్టుకోవడానికి రాక్, సోల్ భారతీయ ప్రభావాల మిశ్రమాన్ని తీసుకువస్తోంది. ఈ నేపథ్యంలోనే శ్రుతి హాసన్ తాజాగా తన రాబోయే ప్రత్యక్ష ప్రదర్శన సన్నాహాల రిహార్సల్ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఆమె బ్యాండ్ సహచరులతో కలిసి ప్రాక్టీస్ సెషన్ లో మునిగిపోతున్న ఈ వీడియో, తెరవెనుక సంగీతం పట్ల ఉన్న ఆమె మక్కువను చూడటానికి అభిమానులకు వీలు కల్పిస్తుంది. తన ఇన్ స్ట్రాగామ్ పోస్ట్ లో, శ్రుతి తన తోటి సంగీతకారులకు కృతజ్ఞతలు తెలుపుతూ, వారిని 'నేరంలో సోదరులు' అని పేర్కొంది. ఆమె ఇలా రాసింది, 'మనం ఆ షో చేసి ఉంటే బాగుండేది కానీ చేయలేక పోయాం (మా తప్పు కాదు) కానీ మిమ్మల్ని ప్రత్యక్షంగా చూడటానికి మేం ఇంకా వేచి ఉండలేం. త్వరలో మీ అందమైన ముఖాలన్నీ చూడాలనుకుంటున్నాను. నా అద్భుతమైన సంగీతకారులకు, నేరంలో ఉన్న నా సోదరులకు ఈ సంగీతం ప్రతిధ్వనించే ధైర్యం ఉన్న కొద్దిమంది ఆత్మలకు ధన్యవాదాలు. త్వరలో హైదరాబాద్‌లో కలుద్దాం, మీకు నా హృదయంలో చోటు ఉందని మీకు తెలుసు' అంటూ ఆమె అభిమానులను తన పోస్ట్ ద్వారా ఊరడించింది ఎప్పుడూ సంగీతం పట్ల మక్కువ కలిగి ఉండే శ్రుతి హాసన్ ఈ సంవత్సరం తన సినిమా కమిట్‌మెంట్‌లను నిర్వహిస్తూనే మరిన్ని స్వతంత్ర పాటలను విడుదల చేయనుంది. భవిష్యత్తులో మరిన్ని ప్రత్యక్ష ప్రదర్శనలకు ఆమె సిద్ధమవుతున్నందున, ఆమె సంగీత ప్రయాణం ఎలా సాగుతుందో చూడటానికి ఆమె అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. ప్రస్తుతానికి, హైదరాబాద్‌లో ఆమె తొలి షో ఆమె శృతి మ్యూజికల్ జర్నీకి మలుపు కానుంది.

# 'స్పిరిట్' తర్వాతే 'యానిమల్ పార్క్'.. ఆ వార్తలకు చెక్



**'స్పిరిట్' సినిమా అప్‌డేట్‌ను నిర్మాత భూషణ్‌కుమార్ పంచుకున్నారు. దీంతో ప్రభాస్ అభిమానులు ఆనందిస్తున్నారు.**

హీరో ప్రభాస్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో 'స్పిరిట్' రానున్న విషయం తెలిసిందే. దీన్ని అధికారికంగా ప్రకటించిన నాటినుంచే అభిమానుల్లో అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా షూటింగ్ ఆలస్యం అవుతుందంటూ కొన్ని వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. తాజాగా వాటిపై నిర్మాత భూషణ్ కుమార్ స్పష్టతనిచ్చారు. దీని చిత్రీకరణకు సంబంధించిన అప్‌డేట్‌ను పంచుకున్నారు.

ప్రస్తుతం సందీప్ వంగా వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన దర్శకత్వంలో వచ్చిన 'యానిమల్'కు సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' తెరకెక్కనుంది. అయితే స్పిరిట్ కంటే ముందే 'యానిమల్ పార్క్' తెరకెక్కుతుందని కొన్ని రోజుల నుంచి వార్తలు వైరల్‌గా మారాయి. తాజాగా నిర్మాత భూషణ్ కుమార్ మాట్లాడుతూ వాటిని ఖండించారు. మరో రెండు, మూడు నెలల్లో 'స్పిరిట్' షూటింగ్ ప్రారంభం కానుందన్నారు . ఈ సినిమా తర్వాతే 'యానిమల్ పార్క్'ను రూపొందిస్తారని తెలిపారు. 2027లో రిలీజ్ చేయనున్నట్లు చెప్పారు. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ సంబర పడుతున్నారు.

సందీప్ వంగా సినిమా కంటే ముందు ప్రశాంత్ వర్మతో ప్రభాస్ ఓ సినిమా చేయనున్నారని కూడా ఇటీవల సోషల్ మీడియాలో పోస్ట్‌లు కనిపించాయి. తాజాగా భూషణ్ కుమార్ వెల్లడించిన అప్‌డేట్‌తో వాటికి చెక్ పడింది. ప్రస్తుతం ప్రభాస్ చేతిలో వరుస సినిమాలు ఉన్నాయి. ఆయన నటించిన 'రాజాసాబ్' విడుదలకు సిద్ధంగా ఉంది. దీని తర్వాత 'స్పిరిట్', 'కల్కి 2', 'సలార్ 2'ల్లో నటించనున్నారు. వీటికంటే ముందు 'కన్నప్ప'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు.

# ఇలాంటి ప్రవర్తనను ఎవరైనా అనుమతిస్తారా?: ఆ యాక్సిడెంట్‌పై జాన్వీ సీరియస్ పోస్ట్




తాజాగా జైపుర్‌లో జరిగిన యాక్సిడెంట్‌పై నటి జాన్వీ పోస్ట్ పెట్టారు. మద్యం కారణంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

సోషల్ మీడియాలో ఎప్పడూ యాక్టివ్‌గా ఉంటారు నటి జాన్వీకపూర్ . సమాజంలో జరుగుతోన్న విషయాలపై తన అభిప్రాయాన్ని తెలుపుతుంటారు. తాజాగా జైపుర్‌లో జరిగిన ఓ యాక్సిడెంట్‌పై జాన్వీ సీరియస్ పోస్ట్ పెట్టారు. ఓ మహిళ మద్యం మత్తులో కారు నడుపుతూ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై జాన్వీ స్పందిస్తూ మద్యం కారణంగా ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయని విచారం వ్యక్తంచేశారు.

"ఇలాంటి నిర్లక్ష్యపు ప్రవర్తనను ఎవరైనా అనుమతిస్తారా?. మద్యం తాగి వాహనం నడపడం వల్ల చుట్టూ ఉన్న వారి ప్రాణాలను కూడా ప్రమాదంలో పడేయడం సరైనది అని ఎవరైనా అనుకుంటారా?. ఈ యాక్సిడెంట్ గురించి తెలిసి దిగ్భ్రాంతికి గురయ్యాను. మద్యం కారణంగా జరిగే ప్రమాదాల్లో ఎంతోమంది జీవితాలను కోల్పోతున్నారు. మరెంతోమంది గాయాలపాలవుతున్నారు. చట్టాలను మనం ఎందుకు గౌరవించడం లేదు. కనీస అవగాహన లేకుండా చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తున్నాం" అని తన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు.

ప్రస్తుతం జాన్వీకపూర్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. మరికొన్ని రోజుల్లో 'పరమ్ సుందరి'గా తెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. భాషతో సంబంధం లేకుండా అగ్రతారల సరసన వరుస అవకాశాలతో జోరు మీదున్న ఈ భామ.. తమిళంలోకి అడుగుపెట్టనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆమె ఖాతాలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' , 'సన్నీ సంస్కారి కీ తులసీ కుమారి' తదితర చిత్రాలు ఉన్నాయి.

# కింగ్డమ్' స్టోరీని రివీల్ చేసిన మొదటి పాట




విజయ్ దేవరకొండ లేటెస్ట్ మూవీ 'కింగ్డమ్'. మే 30న థియేటర్లలోకి రానుంది. కొన్నిరోజుల ముందు వరకు సినిమా వాయిదా పడుతుందని రూమర్స్ వినిపించాయి. కానీ తాజాగా పాటతో ప్రమోషన్స్ తో మొదలుపెట్టడంతో పుకార్లకు చెక్ పడింది. ఇప్పుడు ఆ పాటని రిలీజ్ చేశారు.

'హృదయం లోపల..' అంటూ సాగే ఈ గీతంలో కింగ్డమ్ సినిమా కథేంటి అనేది కొంతలో కొంత రివీల్ చేశారని చెప్పొచ్చు. సూరి అనే రౌడీ, అతడితో ప్రేమలో ఉన్న ఓ డాక్టర్.. వీళ్లిద్దరూ కలిసి శ్రీలంక ఆర్మీపై ఏదో ప్లాన్ చేస్తున్నట్లు కనిపించారు. అదేంటి అనేది మాత్రం సినిమా చూసి తెలుసుకోవాలి.

కింగ్డమ్ సినిమాలో సూరి అనే పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించాడు. అతడి ప్రేయసిగా భాగ్యశ్రీ బోర్సే నటించింది. ఈ పాటలో ఓవైపు చంపడం చూపిస్తూనే, చివర్లో రొమాన్స్ కూడా చూపించారు. సినిమా కూడా అటు యాక్షన్, ఇటు రొమాన్స్ అనేలా ఉంటుందని హింట్ ఇచ్చారేమో?

# నాకూ అలా చూడడమే ఇష్టం: 'బాహుబలి', 'పుష్ప'పై నాగార్జున కామెంట్స్



**'బాహుబలి', 'పుష్ప', 'కేజీయఫ్' చిత్రాలపై నాగార్జున ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'వేవ్స్'లో ఆయన మాట్లాడారు.**

ముంబయి: 'వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)'లో టాలీవుడ్ ప్రముఖ నటుడు నాగార్జున శుక్రవారం పాల్గొన్నారు. ఆ సమ్మిట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'తెలంగాణ స్టాల్'ను ఆవిష్కరించారు. అనంతరం.. కార్తి, ఖుష్బూ, అనుపమ్‌ఖేర్‌తో కలిసి 'పాన్ ఇండియా సినిమా'పై నాగార్జున మాట్లాడారు.

''పుష్ప' సిరీస్ సినిమాలు తెలుగు కంటే వేరే భాషల్లో ఎక్కువ వసూలు చేశాయి. 100లో 90మంది తమ ఒత్తిడి పోగొట్టుకునేందుకు తెరపై జరిగే మ్యాజిక్ (సినిమాలు) చూసేందుకు ఇష్టపడుతుంటారు. నేటితరం ప్రేక్షకులు హీరోలను.. పుష్పరాజ్, రాకీ (కేజీయఫ్), బాహుబలిలాంటి లార్జర్ దేన్ లైఫ్ రోల్స్‌లో చూడాలనుకుంటున్నారు. నేనూ అదే ఇష్టపడతా. కేవలం హీరోల ఎలివేషనే కాదు బలమైన కథలతోనే ఆయా చిత్రాలు విజయాలు సాధించాయి. రాజమౌళి 'బాహుబలి'ని తెలుగులోనే తెరకెక్కించినా.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆడియన్స్ దాన్ని ఆదరించారు'' అని పేర్కొన్నారు. ఆమిర్‌ఖాన్, కరీనా కపూర్, విజయ్ దేవరకొండ తదితరులు ఆ వేడుకకు నేడు హాజరయ్యారు. గురువారం ప్రారంభమైన సమ్మిట్.. ఆదివారం వరకు కొనసాగనుంది.

అలా.. మార్పు మొదలు: ఆమిర్‌ఖాన్
'స్టూడియోస్ ఆఫ్ ది ఫ్యూచర్' టాపిక్‌పై ఆమిర్‌ఖాన్ మాట్లాడుతూ.. ''భారత్‌లోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మంచి డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఉండాలి. భారతీయ సినీ నిర్మాతలు.. విదేశాల్లో డిస్ట్రిబ్యూషన్ గురించి ఆలోచిస్తే మార్పు మొదలవుతుంది. దేశవ్యాప్తంగా మరిన్ని స్క్రీన్స్ పెంచేందుకు ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం ఉంది'' అని అన్నారు. 'స్త్రీ 2' నిర్మాత దినేశ్ విజన్ ఆమిర్ వ్యాఖ్యలను సమర్థించారు. కంటెంట్ కింగ్ అయినా.. డిస్ట్రిబ్యూషన్ గాడ్ అని పేర్కొన్నారు.

# కీలక మ్యాచ్‌లో హైదరాబాద్ బోల్తా.. ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం





**అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను గుజరాత్ టైటాన్స్ 38 పరుగుల తేడాతో ఓడించింది.**

అహ్మదాబాద్: ఐపీఎల్ 18 భాగంగా కీలక మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఓటమి పాలైంది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఎస్ఆర్‌హెచ్‌పై గుజరాత్ టైటాన్స్ 38 పరుగుల తేడాతో గెలుపొందింది. తొలుత శుభ్‌మన్ గిల్ (76: 38 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోస్ బట్లర్ (64: 37 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (48: 23 బంతుల్లో 9 ఫోర్లు) చెలరేగడంతో గుజరాత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 224 పరుగులు చేసింది. హైదరాబాద్ బౌలర్లలో ఉనద్కత్ 3, కమిన్స్, అన్సారీ తలో వికెట్ తీశారు.

అనంతరం లక్ష్యఛేదనకు దిగిన హైదరాబాద్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 186 పరుగులకే పరిమితం అయింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (74; 41 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగినా మిగతావారు విఫలం కావడంతో ఆ జట్టు గెలుపు తీరాలకు చేరలేకపోయింది. క్లాసెన్ (23; 18 బంతుల్లో 1 ఫోర్లు, ఒక సిక్స్), నితీశ్ కుమార్ రెడ్డి (21*; 10 బంతుల్లో 1 ఫోర్లు, 2 సిక్స్‌లు), ప్యాట్ కమిన్స్ (19*; 10 బంతుల్లో 1 ఫోర్లు, ఒక సిక్స్) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్ 2, ఇషాంత్ శర్మ, కొయిట్జీ తలో వికెట్ తీశారు. 10 మ్యాచ్‌లు ఆడిన ఎస్ఆర్‌హెచ్‌కు ఇది ఏడో ఓటమి. దీంతో హైదరాబాద్ ప్లే ఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. మరోవైపు, గుజరాత్ 10 మ్యాచ్‌ల్లో 7 విజయాలతో పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి దూసుకెళ్లింది.



# అశ్విన్‌ను చెన్నై వదిలేస్తుందేమో: మాజీ కోచ్ వ్యాఖ్యలు



**వచ్చే సీజన్‌కు సీనియర్ బౌలర్ అశ్విన్‌ను చెన్నై జట్టు వదులుకునే అవకాశాలు ఎక్కువగా కన్పిస్తున్నాయని మాజీ కోచ్ అభిప్రాయపడ్డారు.**

దాదాపు 12 ఏళ్ల తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్న రవిచంద్రన్ అశ్విన్ .. ఈ ఐపీఎల్ సీజన్‌లో అంచనాలను అందుకోలేకపోతున్నాడు. దీంతో అతడిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే టీమ్‌ఇండియా మాజీ కోచ్ సంజయ్ బంగర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. వచ్చే సీజన్‌లో యాష్.. చెన్నై జట్టులో ఉండకపోవచ్చని అంచనా వేశాడు. అతడితో పాటు మరో పేసర్ పతిరణను కూడా జట్టు వదిలేసుకునే అవకాశాలున్నాయని అన్నాడు.

"ఐపీఎల్ 2026 సీజన్‌కు అశ్విన్‌ను చెన్నై జట్టు రిటైన్ చేసుకుంటుందా? లేదా అనేది పెద్ద ప్రశ్నగా మారింది. ఎందుకంటే అతడి వద్దే చెన్నై పర్సులో చాలా డబ్బు లాక్ అయ్యింది. పర్సు విలువను పెంచుకోవాలనుకుంటే ఆ జట్టు కొన్ని నిర్ణయాలు తీసుకోక తప్పదు. నాకున్న సమాచారం ప్రకారం.. పెద్ద మొత్తం వెచ్చించి తీసుకున్న వారిలో ఇద్దరు ఆటగాళ్లు అశ్విన్, పతిరణను వదిలేసుకునే అంశంపై ఆ జట్టు ఆలోచన చేస్తుంది. వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవాలనే దానిపై జట్టు దృష్టి పెట్టొచ్చు" అని సంజయ్ బంగర్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ సీజన్‌కు ముందు జరిగిన వేలంలో అశ్విన్ కోసం చెన్నై భారీగానే ఖర్చు చేసింది. రూ.9.75 కోట్లు వెచ్చించి అతడిని దక్కించుకుంది. ఇక, మతీశా పతిరణను రూ.13కోట్లతో రిటైన్ చేసుకుంది. అయితే, తాజా సీజన్‌లో అశ్విన్ పెద్దగా ప్రభావం చూపించలేకపోతున్నాడు. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో కేవలం 5 వికెట్లు మాత్రమే తీశాడు. దీంతో కొన్ని మ్యాచ్‌ల్లో జట్టు అతడిని పక్కనబెట్టింది. అటు పతిరణ కూడా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. ఇక, ఈ సీజన్‌లో చెన్నై ఘోరంగా విఫలమైంది. ఆడిన 10 మ్యాచ్‌లో ఎనిమిది ఓడి ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.

# సంజు శాంసన్ విషయంలో వ్యాఖ్యలు.. శ్రీశాంత్‌పై చర్యలు


**విజయ్ హజారే ట్రోఫీలో కేరళ జట్టు నుంచి సంజు శాంసన్‌ను తప్పించారని కేసీఏపై శ్రీశాంత్ ఆరోపణలు చేశాడు. ఈ నేపథ్యంలో కేరళ క్రికెట్ అసోషియేషన్ శ్రీశాంత్‌పై మూడేళ్లపాటు సస్పెన్షన్ విధించింది.**

టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ శ్రీశాంత్‌పై కేరళ క్రికెట్ అసోసియేషన్ చర్యలు తీసుకుంది. అతడిపై మూడేళ్లపాటు సస్పెన్షన్ విధించింది. కేరళ క్రికెట్ లీగ్‌లోని కొల్లం ఏరీస్ ఫ్రాంచైజీకి శ్రీశాంత్ సహ యజమాని. విజయ్ హజారే ట్రోఫీలో కేరళ జట్టు నుంచి సంజు శాంసన్‌ను తప్పించారని కేసీఏపై శ్రీశాంత్ ఆరోపణలు చేశాడు. ఏప్రిల్ 30న సమావేశమైన కేసీఏ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

ఓ మలయాళ టీవీ ఛానెల్‌లో జరిగిన చర్చ సందర్భంగా సంజు శాంసన్ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక కాకపోవడానికి ఓ రకంగా కేసీఏ కారణమని శ్రీశాంత్ ఆరోపించాడు. విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొన్న కేరళ జట్టులో సంజుకు చోటు కల్పించకపోవడంతోనే ఇలా జరిగిందని అతడు విశ్లేషించాడు. అయితే టీవీ చర్చలో సంజుకు, శ్రీశాంత్ మద్దతుగా నిలిచినందుకు నోటీసు ఇవ్వలేదని, కేసీఏ గౌరవ, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా మాట్లాడినందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని కేరళ క్రికెట్ అసోసియేషన్ వివరించింది. అలాగే.. సంజు ఎంపికకు సంబంధించి నిరాధారమైన ఆరోపణలు చేసినందుకు అతడి తండ్రి శాంసన్ విశ్వనాథ్‌తో సహా మరో ఇద్దరిపై నష్టపరిహారం దావా వేయాలని సమావేశంలో కేరళ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు నిర్ణయించారని సమాచారం.

గతంలోనూ శ్రీశాంత్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు సంబంధించి... కొల్లం ఏరీస్, అలప్పుళ టీమ్ లీడ్, అలప్పుళ రిప్పల్స్ ఫ్రాంచైజీలకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. అయితే.. వాటికి ఫ్రాంచైజీలు ఇచ్చిన సమాధానాలు సంతృప్తికరంగా ఉన్నందున, వాటి మీద ఏ విధమైన చర్యలు ఉండవని కేసీఏ తెలిపింది. కానీ జట్టు నిర్వహణకు సభ్యులను నియమించేటప్పుడు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించింది.

# అందుకే అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించా: విరాట్ కోహ్లీ



**విరాట్ కోహ్లీ 2024 టీ20 ప్రపంచ కప్ తర్వాత అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే.**

2024 టీ20 ప్రపంచ కప్ సాధించిన తర్వాత విరాట్ కోహ్లీ అంతర్జాతీయ టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం తీసుకోవడానికి గల కారణాన్ని కోహ్లీ తాజాగా వెల్లడించాడు. కొత్త ప్లేయర్లు జట్టులోకి వచ్చి టీ20 ప్రపంచ కప్ కోసం సన్నద్ధం కావడానికి రెండేళ్లు పడుతుందని, అందుకే 2024 ఫైనల్ ముగిసిన వెంటనే అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికానని తెలిపాడు. 'ఏదో విధంగా పరిస్థితులు నాకు అనుకూలంగా మారాయని అనుకోను. అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలకాలనే నిర్ణయం పూర్తిగా కొత్త ఆటగాళ్లను దృష్టిలో పెట్టుకుని తీసుకున్నదే. కొత్త ప్లేయర్లు జట్టులోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. వారు ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో ఆడి ఆటపై పట్టు సాధించాలి. ఒత్తిడిని ఎలా డీల్ చేయాలో తెలుసుకోవాలి. ప్రపంచ కప్ సమీపించేకల్లా వీలైనన్ని ఎక్కువ మ్యాచ్‌లు ఆడి తాము రెడీగా ఉన్నామని ఫీల్ అవ్వాలి. ఇదంతా జరగడానికి రెండేళ్ల సమయం పడుతుంది. అందుకే టీ20 వరల్డ్ కప్ ముగిసిన వెంటనే రిటైర్మెంట్ ప్రకటించాను' అని కోహ్లీ వివరించాడు.

ఈ ఏడాది జూన్‌లో టీమ్‌ఇండియా ఐదు టెస్టుల సిరీస్ కోసం ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ సిరీస్‌తోనే కొత్త డబ్ల్యూటీసీ ప్రారంభంకానుంది. ఇంగ్లాండ్‌ను వారి సొంత గడ్డపై ఓడించడం భారత్‌కు సవాలుతో కూడుకున్నదే. ఈ నేపథ్యంలో ఐపీఎల్ 2025లో అదరగొడుతున్న గుజరాత్ టైటాన్స్ బ్యాటర్ సాయి సుదర్శన్ ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపిక చేయాలని భారత మాజీ కోచ్ రవిశాస్త్రి సూచించాడు. సుదర్శన్‌కు కౌంటీ క్రికెట్ ఆడిన అనుభవం ఉండటం కూడా కలిసొస్తుందని చెప్పాడు. 2023, 2024లో సుదర్శన్ సర్రే జట్టుకు ఆడి 281 పరుగులు చేశాడు. 'సాయి సుదర్శన్‌ను కొన్ని రోజుల నుంచి గమనిస్తున్నా. అతను ఆల్ ఫార్మాట్ ప్లేయర్. అతను క్లాస్ ప్లేయర్ లాగా ఉన్నాడు. ఎడమచేతి వాటం ఆటగాడు కావడం, ఇంగ్లాండ్ పరిస్థితులపై అవగాహన ఉండటం కూడా ప్లస్ పాయింట్. అతని టెక్నిక్.. ఆడే విధానం అద్భుతం. టీమ్‌ఇండియాలోకి కొత్త వారిని ఎంపిక చేయాలనుకుంటే ఆ లిస్ట్‌లో సుదర్శన్ టాప్‌లో ఉంటాడని భావిస్తున్నా' అని రవిశాస్త్రి పేర్కొన్నాడు.

